క్లుప్తంగా

వరిలో ఆరుతడి విధానం మేలు



రైతులకు ఆరుతడి పంట విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: యర్రంపేట గ్రామంలో నర్చర్ ఫార్మ్ సంస్థ రైతులకు వరిలో ఆరుతడి విధానం దాని ప్రాముఖ్యతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తడి, పొడి విధానం ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, దీనిని అనుసరించటం వలన రైతులకు దిగుబడులు పెరగటమే కాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుందని వివరించారు. నర్చర్ ఫార్మ్ ఏరియా మేనేజర్ ఎన్.శ్రీకాంత్, క్లస్టర్ ఆఫీసర్ దాసరి వెంకన్నబాబు మాట్లాడుతూ ఆరుతడి విధానం ద్వారా వరిలో సాగు నీరు ఆదా అవుతుందని, అలాగే తెగుళ్ళు కూడా కొంతవరకు తగ్గుతాయన్నారు. దీన్ని అందరు రైతులు అవలంబించి వరిసాగులో మంచి ప్రయోజనాలు పొందాలని కోరారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా మోహన్



మద్దు మోహన్

కొయ్యలగూడెం: చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా మద్దు మోహన్ ఎంపిక అయ్యారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆడిటోరియంలో నిర్వహించిన చాంబర్ ఆఫ్ కామర్స్ సర్వసభ్య సమావేశంలో మోహన్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీకి కుర్చీల బహూకరణ



కుర్చీలు అందజేస్తున్న కొత్తూరు అర్చన

కామవరపుకోట: మండలంలోని కొమ్ము గూడెం అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామస్తురాలు కొత్తూరు అర్చన మంగళవారం 15 కుర్చీలు బహూకరించారు. ఈ సందర్భంగా కామవరపుకోట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీవీఎల్ మంగాదేవి మాట్లాడుతూ స్థానిక అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు ఉపయోగపడే విధంగా గ్రామస్తులు కుర్చీలు అందజేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు మంగళవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలేనికి చెందిన బేడపూడి వెంకటేశ్వరరావు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

వరకట్నంతో మహిళలు సతమతం



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి కిషోర్ కుమార్

జంగారెడ్డిగూడెం: స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వరకట్న వ్యతిరేక దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కిషోర్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ వరకట్న నిషేధం చట్టం 1960లో వచ్చినప్పటికీ ఇప్పటికీ దేశంలో మహిళలు వరకట్న సమస్యతో బాధపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపిపి శ్యామల, బార్ సెక్రెటరీ విత్తనాలు రాజు, మాజీ జనరల్ సెక్రెటరీ శ్రీమతి ఏవీవీ భువనేశ్వరి, సీనియర్ న్యాయవాదులైనటువంటి బండారు లతా కుమారి, మాదేపల్లి క్రాంతి కుమార్, పిల్లి పెద్దిరాజు, జువ్వల బాపూజీ రావు, డీఆర్‌వీ కృష్ణ, బల్లె సాయి కుమారి, పోలీస్ అధికారులు మరియు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఆఖిరి మజిలీ అవస్థలు

- సౌకర్యాల లేమితో శ్మశాన వాటిక
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిర్వాసిత గ్రామాల ప్రజలు





చల్లవారిగూడెంలో పిచ్చి మొక్కలతో నిండిన శ్మశాన వాటిక, దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు

జంగారెడ్డిగూడెం రూరల్: పలు సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు ఆఖరి మజిలీలోనూ తిప్పలు తప్పడం లేదు. శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో జంగారెడ్డిగూడెం మండలం చల్లవారిగూడెం పునరావాస కాలనీ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. శ్మశాన వాటికకు కేటాయించిన స్థలం తుప్పలతో, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. నీటి సదుపాయం లేకపోవడంతో పాటు, షెడ్ల నిర్మాణాలు ఇక్కడ ఏర్పాటు చేయలేదని, అలాగే దహన సంస్కారాల సమయంలో అవసరమయ్యే సౌకర్యాలను ఏర్పాటు చేయలేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. కాలనీలో ఎవరైనా చనిపోతే వారికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపుకు గురయ్యే ప్రాంతాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన శ్రీరామపురం, చిగురుమామిడి, నాళ్లవరం, కొయిదా, కట్కూరు, జగన్నాథపురం గ్రామాలతో పాటు, పోలవరం మండలానికి చెందిన సుమారు 500 కుటుంబాల వరకు చల్లవారిగూడెంలో నిర్మించిన కాలనీలకు వచ్చి జీవిస్తున్నారు. కాలనీలో ఎవరైనా మృతి చెందినా దహన సంస్కారాలకు 10 ఎకరాలు శ్మశాన వాటికకు కేటాయించారు. స్థలం కేటాయించారే తప్ప సౌకర్యాల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించలేదని కాలనీ ప్రజలు పేర్కొంటున్నారు. దహన సంస్కారాల సమయంలో అడవిని తలపిస్తున్న శ్మశాన వాటికను తామే శుభ్రం చేసుకుంటున్నామని, కార్యక్రమాల సమయంలో నిలబడడానికి కూడా నీడ లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికకు కేటాయించిన స్థలంలో సౌకర్యాలు ఏర్పాటు చేసి సమస్యలు తీర్చాలని కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు.

రాజ్యాంగంతోనే సమసమాజ స్థాపన



జంగారెడ్డిగూడెం: అంబ్కేదర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



బుట్టాయగూడెం: విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



చింతలపూడి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



లింగపాలెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కె.విజయరాజు



కొయ్యలగూడెం: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: సమసమాజ స్థాపనకు రాజ్యాంగం నాంది పలికిందని, దీని వలన దేశంలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా అందరికీ అన్ని రంగాల్లో సమాన అవకాశాలు వస్తున్నాయంటే అది రాజ్యాంగం గొప్పతనమేనని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు అన్నారు. బస్టాండ్ వద్ద వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో, డాంగేనగర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, ఏలూరు జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ఎల్‌వీఆర్, అయినాల వెంకట రమణమూర్తి, నెకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, నాయకులు బత్తిన చిన్న, జెట్టి ఆదిత్య పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: భారత రాజ్యాంగ అమలకు రాజ్యాంగేతర శక్తులు ప్రతిబంధకంగా మారాయనీ, 75వ రాజ్యాంగ అవతరణ దినోత్సవ ఆవశ్యకత గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు అనుగుణంగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం మంగళవారం పరింపూడి బాయ్స్ హైస్కూల్ వద్ద నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, ఎంపీపీ గంజిమాల రామారావు, పార్టీ నాయకులు మంతెన సోమరాజు, పసుపులేటి రాంబాబు, నూకల రాము, గంటా శ్రీను, కంభంపాటి బుజ్జిబాబు, గిద్దె సూర్యచంద్రం, చిటికెన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చిక్కాలకు అభినందనలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తున్న చిక్కాల దుర్గాప్రసాద్‌ను పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే అభినందించారు.

ఘనంగా రాజ్యాంగ అవతరణ దినోత్సవం

రాజ్యాంగ అవతరణ దినోత్సవ కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలలో అదేవిధంగా పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. రాజవరం గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బయ్యనగూడెంలో నిర్వహించిన మరో కార్యక్రమంలో సరిపల్లి రోడ్‌లో ఉన్న పాఠశాలలో విద్యార్థులు భారతదేశ చిత్రపటం ఆకారంలో కూర్చుని రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

లింగపాలెం: ప్రజాస్వామ్య దేశంలో అద్భుతమైన రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిర్మించారని చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. మాజీ సీఎం వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ధర్మాజీగూడెంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కె.విజయరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం అంబేద్కర్ రాజ్యాంగం కన్నా, నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయటం, అరాచక పాలన సాగించటంతో పాటు సోషల్ మీడియా కన్వీనర్లపై ఉక్కుపాదం మోపుతుందని ఈయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొటారి మోహన్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, సర్పంచులు కొత్తూరు మౌనిక, సీహెచ్ రవిబాబు, తాడేపల్లి శాంతారావు, పి.ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేత ముసునూరు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, ఎంపీడీఓ ఆఫీస్ కార్యాలయ సమీపంలో బోయగూడెంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మద్దా ఆనంద్, లంకపల్లి భానుకుమార్, బోడా అనీష్, శానంపూడి కాంతారావు, నత్తా రవికుమార్, బందెల ముత్తైశ్వరరావు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మండలంలోని పలు కార్యాలయాల్లో భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మునీంద్రరావు, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు శ్రీను, హిస్టరీ అధ్యాపకుడు శ్రీనివాస్, జువాలజీ అధ్యాపకుడు వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ పొలిటికల్ సైన్స్ విభాగముల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం. విజయ కృష్ణ పాల్గొన్నారు.

● పోలవరం రూరల్: ప్రపంచంలో అత్యున్నత రాజ్యాంగం భారత రాజ్యాంగమని ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కర్ అన్నారు. పోలవరం అంబేద్కర్ సెంటర్ వద్ద, అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డులతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బొరగం భూచంద్రరావు, ఎస్.సాయికృష్ణ, టి.శాంతి, వీరయమ్మ, గోకూరి రామకృష్ణ, ముత్యాలమ్మ, సున్నం కన్నయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలో ప్రఖ్యాతిగాంచిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కార్తీకమాసం చివరి మంగళవారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ధర్మకర్త బాలం దత్తుడు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్వయంభువుగా వెలసిన స్వామివారి ప్రాశస్త్యాన్ని, ఆలయ స్థల పురాణాన్ని భక్తులకు తెలిసే విధంగా శిలా ఫలకాన్ని ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజుకు ఆయన సూచించారు. ప్రధాన అర్చకులు కొత్తలంక శివ సత్యనారాయణ చార్యుల ఆధ్వర్యంలో బాలరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాయు గుండంతో అన్నదాత దిగాలు

మెట్టలో ముమ్మరంగా వరి కోతలు



చింతలపూడి మండలంలో యంత్రాలతో వరి కోతలు కోస్తున్న రైతులు

చింతలపూడి: బంగాళాఖాతంలో అల్ప పీడనం వాయుగుండంగా మారి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అన్నదాత దిగాలు చెందుతున్నాడు. మెట్ట రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. అదిగో వచ్చేస్తుంది, ఇదిగో వచ్చేస్తుంది అంటూ వాతావరణ కేంద్రాలు గత రెండు, మూడు రోజుల నుంచి దిన పత్రికల్లో, టీవీ న్యూస్ ఛానల్స్‌లో వస్తున్న ప్రకటనలు చూసి రైతులు బెంబేలెత్తుతున్నారు. సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది సుమారు 24,608 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 13,174 ఎకరాలు, లింగపాలెం మండలంలో 6,473 ఎకరాలు, కామవరపుకోట మండలంలో 2,829.1 ఎకరాలు, టి.నరసాపురం మండలంలో 2,132 ఎకరాలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మెట్ట ప్రాంతంలో వరి పంట కోతలు ముమ్మరంగా సాగుకు వచ్చి సిద్ధంగా ఉంది. ఈ నెల ప్రారంభంలో వచ్చిన తుఫాన్‌ల ప్రభావం మెట్టపై అంతగా లేక పోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ తుఫాను గండం పొంచి ఉండటంతో చేతికొచ్చిన పంట ఎక్కడ నోటికి దక్కకుండా పోతుందోనని ఖర్చుకు వెనుకాడకుడా వరి కోతలకు సిద్ధమయ్యారు. గ్రామాల్లో కూలీల కొరత ఉండటంతో రైతులు వరికోత యంత్రాలపై ఆధారపడ్డారు. గంటకు రూ.3,000 నుంచి రూ. 3,500 వరకు చెల్లించి కోతలు కోయిస్తున్నారు. యంత్రాలతో అయితే ఒకేసారి కోతతో పాటు ధాన్యం నూర్పడం కూడా పూర్తవుతుండటంతో యంత్రాల కోసం రైతులు ఎగబడుతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న వరికోత యంత్రాల యజమానులు ఎక్కువ డిమాండ్ చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఒక్క చింతలపూడి మండలంలోనే వందకు పైగా వరికోత యంత్రాలు పని చేస్తున్నాయి. తుఫాన్ భయంతో కోతలు కోసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న గ్రంథాయాధికారిణి

ద్వారకాతిరుమల: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రంథాలయాధికారిణి గుర్రం బంగారుపాప అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రంథాలయాధికారిణి గుర్రం బంగారుపాప రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ గొప్పతనాన్ని పాఠకులకు, విద్యార్థులకు వివరించారు.

మినీ అంగన్‌వాడీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కుక్కునూరు: జనాభాతో సంబంధం లేకుండా మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ నిరంతరం విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి పాముల అన్నపూర్ణ, మంగ, భవాని, వందన, నాగమణి, సుజాత, పున్నమ్మ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజా వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ ఎంవీ రమణ

వేలేరుపాడు: పోలవరం ముంపు మండలమైన వేలేరుపాడు మండలంలో గత కొన్నేళ్లుగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవీ రమణ పేర్కొన్నారు. మంగళవారం ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ల్యాండ్ టు ల్యాండ్, ఆర్‌అండ్‌ఆర్, భూ నష్ట పరిహారం, తదితర సమస్యలు మండలంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. మండలంలో వివిధ సమస్యలపై మొత్తం 133 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో భూసేకరణ యూనిట్-2 ఏలూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి, వేలేరుపాడు తహసీల్దారు సత్యనారాయణ, సీనియర్ అస్టెంట్ భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ఎరువుల పంపిణీ



గిరిజన రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: బిర్సా ముండా జయంతి సందర్భంగా గిరిజన రైతులకు ఉత్పత్తి పరికరాలు, ఎరువులను పంపిణీ చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో బిర్సా ముండా పోరాటం ప్రత్యేకమైందని జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1 అక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీహరి అన్నారు. వేలం కేంద్రంలో మంగళవారం జన జాతీయ గౌరవ దివస్ వేడుకలు, బిర్సా ముండా జయంతిని కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతులతో పొగాకు బోర్డు ద్వారా అందజేస్తున్న సబ్సిడీలపై అవగాహన కల్పించారు. అదే విధంగా పొగాకు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిమితికి మించి సాగు చేస్తే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో గిరిజన రైతులు బన్నే బుచ్చిరాజు, బుద్దుల జలపాల రాయుడు, రైతులు కుక్కల గోపి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏసు మహోత్సవాలు



వాక్య సందేశం అందిస్తున్న రెవరెండ్ ఫాదర్ బెన్నీ

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో ఏసు తిరుహృదయ దేవాలయం నందు మొదటి వార్షికోత్సవ వేడుకలు మూడు రోజుల పాటు అట్టహాసంగా నిర్వహించారు. ఈనెల 23న ప్రారంభమైన ఈ వేడుకలు సోమవారం విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ బెన్నీ పూజాబలి సమర్పించి వాక్య సందేశం అందించారు. కార్యక్రమంలో దేవాలయ విచారణ కర్త ఫాదర్ జానీ వీసీ, గురువులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



గిరిజన గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పీవీఎస్ నాయుడు

చింతలపూడి: విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కేఆర్ పురం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పీవీఎస్ నాయుడు ఆదేశించారు. స్థానిక గిరిజన గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మెనూ అమలుపై విద్యార్థులను ఆరా తీశారు. అదేవిధంగా విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ సమయానికి పాఠశాలకు చేరుకోవాలని, నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉండి విద్యా బోధన చేయాలని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

వరి కోతలు విరమించుకోవాలి

చింతలపూడి: ఈ నెల 29, 30 తేదీల్లో తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండలంలోని రైతులు బుధవారం నుంచి వరి కోతలు విరమించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్ మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కోతలు కోసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. సమాచారం కోసం తహసీల్దార్లను, రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జిలను, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

ఉపాధ్యాయుడిపై విచారణ

ద్వారకాతిరుమల: స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో సోమవారం విద్యార్థులను కొట్టిన గణిత ఉపాధ్యాయుడి తీరుపై డీఈవో విచారణకు ఆదేశించారు. దీంతో ఎంఈఓ-2 పరసా వెంకట్రావు మంగళవారం పాఠశాలలో విచారణ నిర్వహించారు. దెబ్బలు తిన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, గణిత ఉపాధ్యాయుడు ముత్యాలరావు నుంచి ఎంఈఓ స్టేట్‌మెంట్లు రికార్డ్ చేశారు. వాటిని డీఈఓకు పంపారు.

నూతన గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలి



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కుక్కునూరు: గిరిజన సొసైటీ ద్వారా ఇచ్చిన గ్యాస్ కనెక్షన్లను రద్దు చేసి కొత్త గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి బియ్యాన శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అమర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ, గిరిజన సొసైటీ ద్వారా దీపం పథకం కింద ఇండియన్ గ్యాస్ అనుబంధంతో 2016లో జీసీసీ అధికారులు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారన్నారు. ఆ కనెక్షన్ నుంచి కూటమి ప్రభుత్వం ఇచ్చే ఫ్రీ గ్యాస్ సిలిండర్‌ను తీసుకోవాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. వాటి స్థానంలో హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్లను నూతనంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్,పట్ల లక్ష్మయ్య,పులదాసు రమేష్ తదితరులు పాల్గొన్నారు.